సాక్షి
ప్రకాశం
మంగళవారం । 19 । ఆగస్టు । 2025



లారీని ఢీకొని..

జిల్లాలో వేర్వేరు చోట్ల ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న ఇద్దరు యువకులు లారీని ఢీకొని మృత్యువాతపడ్డారు. సింగరాయకొండ మండలంలో జాతీయ రహదారిపై ఒకరు, ఒంగోలు–కర్నూలు రహదారిపై తలమళ్ల వద్ద మరొకరు మృతిచెందారు. - 8లో..



29 బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

రాష్ట్ర ప్రభుత్వం నూతన బార్ పాలసీలో భాగంగా జిల్లాలో 29 బార్లకు లైసెన్సులు మంజూరు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగరాజు తెలిపారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
29 /24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

నవోదయలో క్లస్టర్ స్థాయి కళా ఉత్సవ్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, మున్సిపల్ కమిషనర్ తదితరులు

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు పీఎం శ్రీ జవహర్ నవోదయ–2లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని 19 కళాశాలలకు సంబంధించిన క్లస్టర్ స్థాయి కళా ఉత్సవ్–2025ను ప్రిన్సిపల్ బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మార్కాపురం మున్సిపల్ కమిషనర్ నారాయణరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రకృతిని కాపాడుకుంటూ స్వచ్ఛభారత్ నెలకొల్పేందుకు తమ వంతు పాత్ర పోషించాలని, విలువలతో కూడిన విద్యలో రాణిస్తూ ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. దేశ అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించాలని కోరారు. కళల గురించి విద్యార్థులకు సాధనా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కే మధుసూదన్ శాస్త్రి వివరించారు. గుంటూరుకు చెందిన మంగళంపల్లి బాలమురళీకృష్ణ గవర్నమెంట్ స్కూల్ ఆఫ్ మ్యూజిక్ అండ్ డాన్స్‌కు చెందిన సిబ్బంది బీ సురేష్ బాబు, ప్రభాకర్ రావు, జయశంకర్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. వైస్ ప్రిన్సిపల్ శ్రీధర్, రెండు రాష్ట్రాలలోని నవోదయ విద్యాలయాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాబ్ క్యాలండర్ విడుదల చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ ద్వారా జాబ్ క్యాలండర్ విడుదల చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న డిమాండ్ చేశారు. నగరంలోని ఎల్బీజీ భవనంలో జరుగుతున్న జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ డీఎస్సీలో ఇచ్చిన పోస్టులు కాకుండా ఇంకా మిగిలిపోయిన టీచర్ పోస్టులను త్వరితగతిన భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో మొత్తం 20 వేల పోలీసు కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉండగా 6100 పోస్టులు భర్తీ చేస్తున్నారని, మిగిలిన 14 వేల పోస్టులను కూడా భర్తీ చేయాలని కోరారు. గ్రూప్ వన్, గ్రూప్ 2, బ్యాక్‌లాగ్ పోస్టులు, రెవెన్యూ డిపార్ట్‌మెంటులో ఉన్న 29 వేల పోస్టులను సాధ్యమైనంత తొందరగా భర్తీ చేయాలన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేఎఫ్ బాబు మాట్లాడుతూ జిల్లాలో వాన్‌పిక్, నిమ్జ్, దొనకొండ ప్రాంతంలో పరిశ్రమలను ఏర్పాటు చేయాలని కోరారు. కేవీ పిచ్చయ్య అధ్యక్షత వహించిన కార్యక్రమంలో పి.కిరణ్, పి.నరేంద్ర, జి.కొండయ్య, మోహన్, సురేష్ పాల్గొన్నారు.





అర్హత ఉన్నా పింఛన్లు తొలగిస్తున్నట్లు నోటీసులు వచ్చాయంటూ కలెక్టరేట్‌కు మీకోసంలో తమ గోడు వెళ్లబోసుకునేందుకు వచ్చిన దివ్యాంగులు

దివ్యాంగులు విలపింఛేన్

ప్రభుత్వ కుట్రలకు దివ్యాంగులు బలైపోతున్నారు. పింఛన్లు పెంచి ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ఏదో ఒక వంక పెట్టి పింఛన్లను అడ్డగోలుగా తొలగిస్తోంది. రీవెరిఫికేషన్ పేరుతో 90 నుంచి 80 శాతం వైకల్యం ఉన్నా..కోత పెట్టి దివ్యాంగ పింఛన్ తీసుకునేందుకు అనర్హులంటూ లబ్ధిదారులకు నోటీసులు పంపుతోంది. ఇప్పటికే జిల్లాలో 9 వేల మంది దివ్యాంగ పింఛన్‌దారులకు ఇలా అనర్హులంటూ నోటీసులు పంపించారు. దీంతో వారంతా తమ నోటిదగ్గర కూడు తీసేస్తున్నారంటూ లబోదిబోమంటున్నారు.

90 శాతం వైకల్యం ఉన్నా..

తాళ్లూరు మండలం గంగాపాలెం గ్రామానికి చెందిన షబ్బీర్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తాడు. అతనికి మొగల్ మహమ్మద్ రసూల్ అనే 8 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. రసూల్‌కు 90 శాతం అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. కాళ్లు, చేతులూ పనిచేయవు. మానసికంగా కూడా వికలాంగుడే. రసూల్ ఇప్పటి వరకూ దివ్యాంగుల పింఛను తీసుకుంటున్నాడు. అయితే ఇటీవల నిర్వహించిన వైద్య పరీక్షల్లో భాగంగా రీ వెరిఫికేషన్‌లో ఆ బాలుడిది సాధారణ అంగవైకల్యం అని వైద్యులు నిర్ధారించటంతో దివ్యాంగుల పింఛనుకు అనర్హుడని ఇంటికి నోటీసులు పంపించారు. దాంతో ఒక్కసారిగా అవాక్కయిన తండ్రి షబ్బీర్ కుమారుడిని తీసుకొని కలెక్టర్‌ను కలవటానికి సోమవారం ఒంగోలు వచ్చారు.

- దివ్యాంగుల పింఛన్లలో కూటమి ప్రభుత్వం కోత
- రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులకు ఇక్కట్లు
- జిల్లాలో 9 వేలకు పైగా పింఛన్లు తొలగిస్తున్నట్లు నోటీసులు
- లబోదిబోమంటున్న దివ్యాంగులు
- కూటమి ప్రభుత్వం తమ పొట్టకొడుతోందని ధ్వజం
- కలెక్టర్ గ్రీవెన్స్, సదరం సెంటర్లకు పోటెత్తిన దివ్యాంగులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా...అధికారంలోకి వచ్చిన తరువాత మరోలా మాట్లాడటం టీడీపీ అధినేత చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఎన్నికల సమయంలో దివ్యాంగులకు అప్పటి వరకు ఉన్న రూ.3 వేల పింఛన్‌ను అధికారంలోకి రాగానే రూ.6 వేలు చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చిన తరువాత దివ్యాంగుల పింఛనును రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచినట్లే పెంచి లబ్ధిదారుల సంఖ్యలో భారీగా కోతలు పెట్టేందుకు రంగం సిద్ధం చేశాడు. దివ్యాంగులను తిరిగి వైద్యులచే పరీక్షలు నిర్వహించేందుకు రీ వెరిఫికేషన్ ప్రక్రియను గత ఏడాది డిసెంబర్ నుంచి ప్రారంభించారు. రీ వెరిఫికేషన్ పేరిట చేపట్టిన ఆరోగ్య పరీక్షల్లో వేలాది మందిని అనర్హులుగా చేసే కుట్రకు తెరలేపారు. రీ వెరిఫికేషన్‌లో అంగవైకల్యం 90 శాతం, 80 శాతం ఉన్నా అడ్డంగా ఆ శాతాలకు కోత విధించి దివ్యాంగుల పింఛన్లకు కోత పెట్టే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. అందుకుగాను ఏరియాల వారీగా సదరమ్ క్యాంపులు నిర్వహించి పింఛన్లు తీసుకుంటున్న దివ్యాంగులకు వైద్య పరీక్షలు చేయించారు. జిల్లా వ్యాప్తంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పింఛన్ తీసుకుంటున్న వారు 33,310 మంది ఉన్నారు. వారిలో ఇప్పటి వరకు 30 వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు చెబుతున్నారు.



మీకోసంలో జిల్లా అధికారికి తమ సమస్యలను వివరిస్తున్న దివ్యాంగులు

పింఛనుకు అనర్హులని నోటీసులు జారీ...

సదరమ్ క్యాంపుల్లో వైద్య పరీక్షలు నిర్వహించిన మీదట కొంతమందికి దివ్యాంగ పింఛను తీసుకోవటానికి మీరు అనర్హులంటూ ఇప్పటికే పింఛన్లు తీసుకుంటున్న దివ్యాంగులకు నోటీసులు పంపుతున్నారు. ఈ విధంగా నోటీసులు జిల్లాలో దాదాపు 9 వేల మంది వరకు వచ్చాయన్నది సమాచారం. దీంతో బెంబేలెత్తిన దివ్యాంగులు ఆ నోటీసులు తీసుకొని సోమవారం ఒంగోలులో నిర్వహిస్తున్న కలెక్టర్ మీ కోసం కార్యక్రమానికి పోటెత్తారు. 90 శాతం, 85 శాతం అంగవైకల్యంతో ఇప్పటి వరకు పింఛను పొందుతుంటే రీ వెరిఫికేషన్‌లో సాధారణ వైకల్యం మాత్రమే ఉందని, అందుకు దివ్యాంగుల పింఛనుకు అనర్హులని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా నోటీసులు జారీ చేశారు. దాంతో దివ్యాంగులు లబోదిబోమంటూ జిల్లా అధికారుల వద్దకు క్యూ కడుతున్నారు. ఈ నెల 27 నాటికి తొలగింపు ప్రక్రియ పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నట్లు స్పష్టమవుతోంది. దాంతో సెప్టెంబర్‌లో పింఛను రాదేమోనని దివ్యాంగులు ఆందోళన చెందుతున్నారు.

నా పింఛన్ తొలగించారు...



ఒక చేయి పూర్తిగా పని చేయదు. గత పది సంవత్సరాలుగా దివ్యాంగుల పింఛను తీసుకుంటున్నాను. ఇటీవల దర్శి ప్రాథమిక వైద్యశాలలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అక్కడ వైద్యుడు కనీసం నన్ను పరీక్ష కూడా చేయలేదు. కూర్చోబెట్టి అటూ ఇటూ తిరగమన్నాడు. అంతే లేచి వెళ్లిపొమ్మన్నాడు. తీరా ఇంటికి మాత్రం దివ్యాంగుల పింఛనుకు అనర్హుడవని నోటీసు వచ్చింది. అంటే పింఛను తొలగించినట్లేనా...సదరం సర్టిఫికెట్‌లో పర్సంటేజ్ తక్కువ ఉందని పింఛను తొలగించారు. ఆ పింఛను మీదనే ఆధారపడి జీవిస్తున్నాను.

– జీఆర్.కృష్ణారావు, తాళ్ళూరు

కావాలనే పింఛన్ తీసేశారు



కావాలనే దర్శి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని వైద్యుడు దివ్యాంగ పింఛను తొలగించాడు. నాకు నడుముల దగ్గర నుంచి కాళ్లు సక్రమంగా పనిచేయవు. పది నిమిషాలు నిలబడలేను. పది నిమిషాలు కూర్చోలేను. ఎక్కువ సేపు పడుకున్నా శరీరమంతా నొప్పులే. అలాంటి నాకు దివ్యాంగుల పింఛను తీసేశారని ఇంటికి నోటీసు వచ్చింది. దర్శి వైద్యశాలకు వెళితే అసలు డాక్టరు కనీస పరీక్షలు కూడా చేయలేదు. మనిషిని చూసి వెళ్లిపొమ్మన్నాడు. చివరకు ఇంటికి దివ్యాంగ పింఛనుకు అనర్హుడవని నోటీసు మాత్రం వచ్చింది. ఇక నేను ఏవిధంగా జీవనం సాగించాలి అని ఆందోళన వ్యక్తం చేశాడు.

– వై.అంజిబాబు, తాళ్లూరు



ఈమె పింఛన్‌కు అనర్హురాలట..

వీల్‌చైర్‌లో కూర్చున్న ఈ యువతి పేరు చిమట త్రివేణి(18). తాళ్లూరు మండలం నాగంబొట్లవారిపాలెం. ఈమెకు రెండో ఏట నుంచే పోలియో సోకి రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. అప్పటి నుంచి మంచానికే పరిమితమైంది. కనీసం బాత్‌రూంకు వెళ్లాలన్నా తల్లి తీసుకెళ్లాల్సిందే. ఈమెకు గతంలో వైద్యులు 90 శాతం అంగవైకల్యం ఉందని సదరమ్‌లో సర్టిఫికెట్ ఇచ్చారు. అప్పటి నుంచి దివ్యాంగురాలిగా పింఛను పొందుతోంది. అయితే ఇటీవల జరిపిన రీ వెరిఫికేషన్‌లో త్రివేణిది సాధారణ వైకల్యం అని పరీక్షలు నిర్వహించిన వైద్యులు సర్టిఫై చేశారు. దాంతో త్రివేణి పింఛనుకు అనర్హురాలని నోటీసులు పంపారు. దాంతో నాగంబొట్లవారిపాలెం నుంచి మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు అర్జీ ఇచ్చేందుకు రిక్షాలో తల్లి అంజమ్మ ఒంగోలుకు తీసుకొచ్చింది. వీల్‌చైర్‌లో కలెక్టరేట్‌లోకి తీసుకెళ్లి మీకోసంలో అర్జీ ఇచ్చి వచ్చింది.

జిల్లాకు ఆరెంజ్ అలర్ట్

- జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు
- పరవళ్లు తొక్కిన తీగలేరు వాగు
- జలదిగ్బంధంలో గంటవానిపల్లె
- లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- సముద్రంలో వేటకు వెళ్లరాదని మత్స్యకారులకు సూచన
- విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ 1912 లేదా 9440817491

ఒంగోలు సబర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఆదివారం జిల్లాలో 15.3 మి.మీల వర్షపాతం నమోదైంది. అదేవిధంగా సోమవారం కూడా పశ్చిమ ప్రాంతంలో అక్కడక్కడా వర్షం కురుస్తూనే ఉంది. జిల్లా వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. ఆదివారం అత్యధికంగా అర్ధవీడు, రాచర్ల మండలాల్లో వర్షం కురిసింది. అర్ధవీడులో 45 మిల్లీ మీటర్లు, రాచర్లలో 43.8 మిల్లీ మీటర్లు, మార్కాపురంలో 32.6, తర్లుపాడులో 29.4, కంభంలో 27.6, పెద్దారవీడు 26.8, బేస్తవారిపేటలో 22.8, వెలిగండ్లలో 21, పుల్లలచెరువులో 20 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని మిగతా మండలాల్లో 5 నుంచి 19 మిల్లీ మీటర్ల వరకు వర్షం కురిసింది.

జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ జారీ...

అల్పపీడనం మరో 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశముందని వాతావరణ శాఖ సూచించింది. అందులో భాగంగా జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఈ నెల 19న దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీర ప్రాంతం మధ్య తీరం దాటవచ్చని వాతావరణ కేంద్రం సూచనల మేరకు జిల్లా యంత్రాంగం అప్రమత్తమయింది. మత్స్యకారులను సముద్రంలో వేటకు వెళ్లరాదని ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. అదేవిధంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా జిల్లా అధికారులకు, మున్సిపల్ కమిషనర్లకు సూచనలు జారీ చేశారు.

విద్యుత్ శాఖ సిబ్బంది సెలవులు రద్దు:

భారీ వర్షాలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగి పడి ఉంటే, వాటిని తాకవద్దని, వెంటనే 1912 నంబర్‌కి సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ 1912 లేదా ఎల్.ఎం.సి 9440817491 నంబర్‌కి కాల్ చేయాలని సూచించారు.



అర్ధవీడులో ఉధృతంగా ప్రవహిస్తున్న జంపలేరు



గంటవానిపల్లె వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తీగలేరు

నల్లమలలో భారీ వర్షాల

పెద్దదోర్నాల: నల్లమల అభయారణ్యంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. పలు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. రెండు రోజులుగా అటవీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో మండల పరిధిలోని తీగలేరు పొంగటంతో గంటవానిపల్లి వద్ద దశాబ్దాల క్రితం నిర్మించిన నేల బారు చప్టాపై నీరు భారీగా ప్రవహిస్తుండంతో గతంలో చప్టాకు చేసిన మరమ్మతులు పూర్తి స్థాయిలో కొట్టుకు పోయినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. దీంతో గ్రామానికి పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. గంటవానిపల్లె ప్రజలు బయటకు రాలేక అత్యవసర పనులు వాయిదా వేసుకోవాల్సి వచ్చిందని వాపోతున్నారు. గ్రామస్తుల చిరకాల స్వప్నమైన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి గత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కర్నూల్, గుంటూరు రహదారి నుంచి తీగలేరు మీదుగా గంటవానిపల్లి గ్రామానికి నిర్మించే ఈ బ్రిడ్జికి సంబంధించి రూ.270 కోట్లు మంజూరు చేస్తూ అప్పటి ప్రభుత్వం జీఓ జారీ చేసిందని, అయితే ఇంత వరకు బ్రిడ్జి నిర్మాణం మొదలు కాలేదని గంటవానిపల్లె గ్రామస్తులు వాపోతున్నారు.

ప్రవహిస్తున్న జంపలేరు వాగు

అర్ధవీడు: నల్లమల అడవుల్లో వారం నుంచి కురుస్తున్న వర్షాలకు బుగ్గ వాగుకు నీరు చేరింది. నాయినిచెరువు నిండు కుండలా నిండి అలుగు రావడంతో జంపలేరు జలకళ సంతరించుకుంది. నాయినిచెరువు కింది భాగంలో ఉన్న పైచెరువు, బొల్లుపల్లి చెరువుకు కూడా నీరు చేరింది. ఇలాగే 10 రోజుల పాటు బుగ్గ నీరు ప్రవహిస్తే అర్ధవీడు చెరువు కూడా నిండుకుండలా జలకళ సంతరించుకుంటుందని ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

'నక్షత్ర వీధుల్లో భారతీయుల పాత్ర' పుస్తకావిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మనోహర్ నాయుడు తదితరులు

ఒంగోలు టౌన్: నగరంలో జరుగుతున్న మూడో పుస్తక మహోత్సవం సోమవారం 4వ రోజుకు చేరుకుంది. విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రచురించిన డాక్టర్ మహీధర నళినీ మోహన్ రచించిన రాకెట్ కథ, నక్షత్ర వీధుల్లో భారతీయుల పాత్ర పుస్తకాలను విశ్రాంత ఐఏఎస్ అధికారి హరి నారాయణ చక్రవర్తి ఆవిష్కరించారు. 16వ శతాబ్దంలో ధూర్జటి రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకం పుస్తకాన్ని విడుదల చేశారు. తిరుమల రామచంద్ర రచించిన మనలిపి పుట్టుపూర్వోత్తరాలు, నుడి–నాడుడి పుస్తకాలను ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక అధ్యక్షుడు వల్లూరు శివప్రసాద్, విశాలాంధ్ర బుక్ హౌస్ జనరల్ మేనేజర్ మనోహర్ నాయుడు విడుదల చేశారు. తిరుమల రామంద్ర శత జయంతి సందర్భంగా ఈ పుస్తకాలను ఆవిష్కరించినట్లు మనోహర్ నాయుడు తెలిపారు. పీవీఆర్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో జరుగుతున్న పుస్తక మహోత్సవానికి వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చిన్నపిల్లల కథలు, చందమామ కథల పుస్తకం, కామిక్స్ తదితర పుస్తకాలతో పాటుగా జనవిజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న సైన్స్ కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి మట్టి బొమ్మలతో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో సుమారు 70 మందికి పైగా విద్యార్థులు, చిన్నారులు పాల్గొన్నారు. వివిధ రకాల మట్టిబొమ్మలు, ఆట వస్తువులను తయారు చేసిన చిన్నారులు తమలోని సృజనాత్మకతను చాటుకున్నారు. ఈ కార్యక్రమం చిన్నారులను, పెద్దలను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాల్లో జిల్లాకు చెందిన పలువురు రచయితలు, మేధావులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

సెప్టెంబర్ నుంచి సాగుకు సాగర్ జలాలు

సాక్షి ఎఫెక్ట్..

యర్రగొండపాలెం: ఎన్ఎస్పీ ప్రధాన కాలువ నుంచి జిల్లాకు సెప్టెంబర్ మొదటి వారంలో సాగు నీటిని పూర్తి స్థాయిలో విడుదల చేయనున్నట్లు దర్శి ఈఈ ఎం.రామకృష్ణ తెలిపారు. సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'నీరున్నా నిష్ఫలం' వార్తకు ఆయన స్పందించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం నాగార్జున సాగర్ డ్యాం నిండుగా ఉండటం వలన సముద్రం పాలయ్యే నీటిని కాలువల ద్వారా డైవర్ట్ చేస్తారని, ఈ నీటిని నోటిఫైడ్, నాన్ నోటిఫైడ్ చెరువులు నింపుకోవడానికి, ఇతర అవసరాలకు వినియోగించుకోవడానికి వదులుతున్నామన్నారు. వరద నీరు వచ్చే సమయంలో రైతుల విజ్ఞప్తి మేరకు అవసరమైన సాగు నీరు సరఫరా చేస్తున్నామన్నారు. కాలువల ద్వారా వదిలే వరద నీటిపై పూర్తిగా ఆధారపడి సాగు చేయవద్దని, ప్రస్తుతం కాలువల్లో వదిలే నీరు వరద నీటి మళ్లింపులో భాగమేనని ఆయన వివరించారు.

స్కూల్ గేమ్స్ సెక్రటరీ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సిటీ: స్కూలు గేమ్స్ సెక్రటరీ నియామకానికి సంబంధించిన దరఖాస్తును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.కిరణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026–27 కు గాను సెక్రటరీగా పనిచేయడానికి ఆసక్తి ఉన్న జిల్లాకు చెందిన ఎస్ఏ (పీడీ, పీఈటీ)లు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి సమాచారం కోసం నోటీసు బోర్డును గమనించాలని సూచించారు.

క్లుప్తంగా

ముప్పా సురేష్ అరెస్టు

ఒంగోలు టౌన్: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన టీడీపీ నాయకుడు ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులో ప్రధాన నిందితుడు ముప్పా సురేష్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు ముందు హాజరుపరచగా రిమాండ్ విధించారు. దీంతో ఆయనను జిల్లా జైలుకు తరలించారు. గత ఏప్రిల్ 22వ తేదీ వీరయ్య చౌదరి హత్య జరిగినప్పటి నుంచి ముప్పా సురేష్ పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. పోలీసులు అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ కోసం తీవ్రంగా ప్రయత్నించాడు. హైకోర్టుకు వెళ్లిన ఆయనకు చుక్కెదురైంది. సుప్రీం కోర్టుకు వెళ్లినా బెయిల్ లభించలేదు. దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆయన ఎస్పీ ఎదుట లొంగిపోయారు. ఆయన అరెస్టుతో వీరయ్య చౌదరి కేసులో నిందితులందరినీ పోలీసులు అరెస్టు చేసినట్లయింది.

ప్రైవేట్ స్థలంలో బీపీసీఎల్ పనులు

- అడ్డుకున్న భూ యజమానులు


ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ నారాయణరెడ్డితో మాట్లాడుతున్న భూ యజమానులు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): కృష్ణపట్నం నుంచి హైదరాబాదు వెళ్లే బీపీసీఎల్ పెట్రోల్ పైపులైన్ నిర్మాణ పనులను ప్రైవేట్ స్థలాలలో చేపట్టడంతో భూ యజమానులు అడ్డుకున్నారు. సంతనూతలపాడు మండలం రెడ్డిపాలెం సర్వే నంబరు 437లో సోమవారం పనులను ప్రారంభించగా, సదరు భూ యజమానులు అడ్డుకున్నారు. భూ యజమానులైన చలువాది బదరీ నారాయణ, పబ్బిశెట్టి శ్రీనివాసరావుకు - బీపీసీఎల్ పెట్రోల్ పైపులైన్ అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. సమాచారం అందుకున్న ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, స్థానిక తహసీల్దార్ నారాయణరెడ్డి ఆ ప్రాంతానికి వెళ్లి నిర్మాణ పనులను నిలిపివేశారు. భూమికి సంబంధించిన పత్రాలతో భూ యజమానులు, బీపీసీఎల్ పెట్రోల్ పైపులైన్ అధికారులు మంగళవారం ఒంగోలు ఆర్డీఓ కార్యాలయానికి రావాలని ఆర్డీఓ ఆదేశించారు.

చెక్ బౌన్స్ కేసులో ఏడాదిన్నర జైలు శిక్ష

ఒంగోలు: చెక్ బౌన్స్ కేసులో నిందితునికి ఏడాదిన్నర జైలు శిక్ష విధిస్తూ ఎక్సైజ్ మేజిస్ట్రేట్ ఎస్.కోమలవల్లి సోమవారం తీర్పు చెప్పారు. పోలీసుశాఖలో అదనపు ఎస్పీగా పనిచేసి రిటైరైన ఒంగోలు నివాసి తాడి జయప్రసాద్ వద్ద కుటుంబ ఖర్చుల నిమిత్తం పోలీసుశాఖలోనే హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసి రిటైరై, అద్దంకి మండలం వేలమూరిపాడులో నివాసం ఉంటున్న జ్యోతి కోటేశ్వరరావు 2015 సెప్టెంబర్ 24న రూ.10 లక్షలు అప్పు తీసుకున్నాడు. అందుకుగానూ ప్రామిసరీ నోటు అందజేశారు. అనంతరం వడ్డీ నిమిత్తం బ్యాంకు ద్వారా రెండు దఫాలు కొంత మొత్తం చెల్లించారు. మిగిలిన మొత్తం చెల్లించమని ఒత్తిడి రావడంతో పార్ట్ పేమెంట్ కింద రూ.12 లక్షలకు చెక్కు ఇచ్చారు. ఈ చెక్కును తాడి జయప్రసాద్ బ్యాంకులో జమ చేయగా, అది బౌన్స్ అయింది. దీంతో ఆయన కోర్టులో కేసు వేశారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయమూర్తి నేరం నిరూపణ అయినట్లు పేర్కొంటూ నిందితుడు జ్యోతి కోటేశ్వరరావుకు ఏడాదిన్నర జైలుశిక్ష, ఫిర్యాదికి నష్టపరిహారం కింద రూ.12 లక్షలు చెల్లించాలని ఆదేశించారు. అదే విధంగా రూ.10 వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 6 నెలల పాటు జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

లారీని ఢీకొని..

- మోటారు సైకిల్‌పై వెళ్తున్న యువకుడు మృతి
- హెల్మెట్ ధరించినా లాక్ పెట్టకపోవడంతో తలకు గాయాలై దుర్మరణం


సంఘటన స్థలంలో లారీ, మోటారు సైకిల్


గాయపడిన జయప్రకాష్‌ను హైవే అంబులెన్స్ ఎక్కిస్తున్న సిబ్బంది


ఇత్తడి జయప్రకాష్ (ఫైల్)

సింగరాయకొండ:

ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి మోటారు సైకిల్‌తో ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన సోమవారం మధ్యాహ్నం సింగరాయకొండ మండల పరిధిలోని విమానాల రన్‌వేపై వెంకటేశ్వర కళ్యాణ మండపం సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జరుగుమల్లి మండలం నందనవనం గ్రామానికి చెందిన ఇత్తడి జయప్రకాష్ (38) జాతీయ రహదారిపై బీకే త్రషర్స్ కంపెనీ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. మధ్యాహ్న సమయంలో పెట్రోల్ బంకు నుంచి మండలంలోని మూలగుంటపాడు గ్రామ పంచాయతీలో నివసిస్తున్న తన యజమాని ఇంటికి బయలుదేరాడు. హెల్మెట్ ధరించి మోటారు సైకిల్‌పై విమానాల రన్ వేపై వెళ్తున్న సమయంలో ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా లారీని రోడ్డు పక్కన ఉన్న హోటల్ వద్ద ఆపే ప్రయత్నం చేశాడు. గమనించని జయప్రకాష్.. లారీ వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టాడు. అతని హెల్మెట్ ముందు భాగం పగిలి అవతల పడగా, మోటారు సైకిల్ అదుపుతప్పి దూరంగా పడింది. ఈ ప్రమాదంలో జయప్రకాష్ తలకు తీవ్రగాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కి తరలిస్తుండగా, మార్గం మధ్యలోనే అతను మరణించాడు. హెల్మెట్ ధరించినప్పటికీ లాక్ పెట్టుకోకపోవటంతో ప్రమాదం జరిగినప్పుడు అది ఎగిరిపడిపోయి జయప్రకాష్ నుదిటికి గాయాలైనట్లు తెలుస్తోంది. జయప్రకాష్ భార్య దివ్యవాణి నందనవనంలో ఆశా కార్యకర్తగా పనిచేస్తుండగా, ఇద్దరు కుమారులు ఉన్నారు. దివ్యవాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర వివరించారు. మృతదేహానికి ఒంగోలు జీజీహెచ్‌లో మంగళవారం పోస్టుమార్టం చేయనున్నట్లు బంధువులు తెలిపారు.

పొదిలి మండలంలో మరో యువకుడు...

పొదిలి రూరల్: ఆగి ఉన్న లారీని ఢీకొని బైక్‌పై వెళ్తున్న యువకుడు మృతిచెందాడు. ఒంగోలు-కర్నూలు రహదారిపై పొదిలి మండలంలోని తలమళ్ల-అగ్రహారం గ్రామాల మధ్య పవర్ గ్రిడ్ వద్ద ఆదివారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పొదిలి మండలంలోని మాదాలవారిపాలేనికి చెందిన దాసరి మధు (24) మర్రిచెట్లపాలెంలోని గ్రానైట్ క్వారీలో పనిచేస్తుంటాడు. రోజూ మాదిరిగా తన పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా, పొదిలి నుంచి ఒంగోలు వైపు వెళ్తూ పవర్‌గ్రిడ్ సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మధు తలకు తీవ్రగాయాలవడంతో స్థానికులు వెంటనే పొదిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధు మృతి చెందాడు.


మృతిచెందిన దాసరి మధు

29 బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

- వాటిలో గీత కార్మికులకు మూడు కేటాయింపు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీ హేమంత్ నాగరాజు, పక్కన ఈఎస్ ఆయేషా బేగం

ఒంగోలు టౌన్: రాష్ట్ర ప్రభుత్వ నూతన బార్ పాలసీలో భాగంగా జిల్లాలో 29 బార్లకు లైసెన్సులు మంజూరు చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు తెలిపారు. స్థానిక ప్రకాశం భవనంలోని డీపీఈఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈఎస్ షేక్ ఆయేషా బేగంతో కలిసి బార్ పాలసీ గురించి ఆయన వివరించారు. 29 బార్లలో గీత కార్మికులకు మూడు బార్లను కేటాయించినట్లు తెలిపారు. ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో 16 బార్లు, మార్కాపురం పరిధిలో 5, చీమకుర్తి, పొదిలి, దర్శి, కనిగిరి, గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో ఒక్కొక్కటి చొప్పున బార్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం అనుమతిచ్చినట్లు వివరించారు. దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో స్వీకరించనున్నట్లు తెలిపారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చని చెప్పారు. ఎక్కడి నుంచైనా దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ఆన్‌లైన్ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. దరఖాస్తు ఫీజు 5 లక్షల రూపాయలు, ప్రాసెసింగ్ ఫీజు 10 వేల రూపాయలతో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 28వ తేదీ అంబేడ్కర్ భవన్‌లో కలెక్టర్ సమక్షంలో డ్రా తీసి లైసెన్సులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. నూతన పాలసీలో రెండు శ్లాబులుగా విభజించారని, ఒంగోలు, మార్కాపురం రూ.55 లక్షల శ్లాబు పరిధిలోకి వస్తాయని, మిగిలిన బార్లు రూ.35 లక్షల శ్లాబు పరిధిలోకి వస్తాయని తెలిపారు. ఈ ఫీజులను ఆరు విడతలుగా చెల్లించవచ్చన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఆయేషా బేగం మాట్లాడుతూ నూతన బార్ల ఏర్పాటుకు హైబ్రిడ్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. గీత కార్మికులకు కేటాయించిన బార్లలో గౌడ కులస్తులు ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో ఒకటి, మార్కాపురం పరిధిలో గౌడ, గాండ్ల కులస్తులకు చెరొకటి చొప్పున రెండు రిజర్వ్ చేసినట్లు చెప్పారు. గీత కార్మికుల బార్లకుగానూ ఈ నెల 28వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. 30వ తేదీ లాటరీ ద్వారా లైసెన్సులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. గీత కార్మికులకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పించినట్లు చెప్పారు. లైసెన్స్ కాలపరిమితి ఈ ఏడాది సెప్టెంబర్ ఒకటి నుంచి 2028 ఆగస్టు వరకు ఉంటుందన్నారు. కొత్త వ్యాపారులు ఎక్కువగా దరఖాస్తు చేసుకునే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. విలేకరుల సమావేశంలో ఏఈఎస్ ఎర్ర వెంకటేష్ పాల్గొన్నారు.

మేస్త్రీలను తొలగించి పొట్టకొట్టారు

- ఏళ్ల తరబడి పనిచేస్తున్నామన్నా పట్టించుకోవడం లేదు
- పనిచేస్తున్న వాళ్లని కాదని కొత్తగా 35 మందిని తీసుకున్నారు.
- ఒంగోలు నగరపాలక సంస్థలో అడ్డగోలు వ్యవహారాలపై మీ కోసం కార్యక్రమంలో జేసీకి ఫిర్యాదు


ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న 55 మంది మేస్త్రీలతో కలిపి దాదాపు 110 మంది పారిశుధ్య కార్మికులను అక్రమంగా తొలగించి పొట్టకొట్టారంటూ సోమవారం స్థానిక ప్రకాశం భవనంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో జేసీ ఆర్.గోపాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. సీఐటీయూ ఒంగోలు నగర అధ్యక్షుడు టి.మహేష్ ఆధ్వర్యంలో ఉద్యోగాలు కోల్పోయిన మేస్త్రీలు, పారిశుధ్య కార్మికులు జేసీని కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా తమను తొలగించి నూతనంగా కూటమి పార్టీల నాయకులు చెప్పిన వారికి ఉద్యోగాలిచ్చారని జేసీ దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు 15 సంవత్సరాలకుపైగా ఒంగోలు మున్సిపాలిటీలో పనిచేస్తున్నామని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తమను ఎలాంటి సమాచారం లేకుండా తొలగించారని చెప్పారు. తాము చేసిన తప్పు ఏమిటని అడిగినా మున్సిపల్ కమిషనర్ చెప్పడం లేదన్నారు. మేస్త్రీ వ్యవస్థ ఇక నుంచి ఉండదని మాత్రమే చెప్పారన్నారు. అలాంటప్పుడు నూతనంగా తీసుకున్న వారు పారిశుధ్య పనులు చేయటం లేదని, మేస్త్రీలుగానే పనిచేస్తున్నారని జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

దేవస్థాన స్థలంలో మున్సిపల్ అధికారులకు ఏం పని.?

మార్కాపురం శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానం పడమట వైపున్న ఖాళీ స్థలాన్ని అద్దెకు ఇచ్చేందుకు మున్సిపాలిటీ అధికారులు టెండర్లు పిలవడం అన్యాయమని మార్కాపురానికి చెందిన పురోహితుడు శ్రీకంఠం నారాయణాచార్యులు జేసీని కలిసి ఫిర్యాదు చేశారు. మార్కాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానానికి ఆమోదించారన్నారు. దేవస్థానానికి సంబంధించిన స్థలంలో మున్సిపల్ అధికారులకు అద్దెకిచ్చే హక్కు ఎవరిచ్చారన్నారు. ఈ విధానం చూస్తుంటే కొందరు కౌన్సిలర్లు, రాజకీయ నాయకులు కలిసి శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవస్థాన స్థలాలను, దేవస్థానం మొత్తాన్ని కూడా అమ్మేదానికి వెనకాడేలా లేరని స్పష్టమవుతోందన్నారు. వెంటనే ఈ తీర్మానాన్ని రద్దు చేయాలని జాయింట్ కలెక్టర్‌ను కోరారు.

సొంత స్థలంలో ఇల్లు కట్టుకుంటే వేధిస్తున్నారు...

ఒంగోలులోని కొప్పోలు రోడ్డులో రైల్వేస్టేషన్‌కు ఉత్తరం వైపు వైఎస్సార్ కాలనీలో సొంతంగా స్థలం కొనుక్కుని ఇంటి నిర్మాణం చేసుకుంటే అక్కడ కొంతమంది డబ్బులివ్వాలని బ్లాక్ మెయిల్ చేస్తూ బెదిరిస్తున్నారని మీ కోసం కార్యక్రమంలో జేసీకి ఓ బ్యాంకు ఉద్యోగి ఫిర్యాదు చేశారు. యూనియన్ బ్యాంక్ టంగుటూరు శాఖలో క్యాషియర్‌గా పనిచేస్తున్న బేలాళ రమేష్ వైఎస్సార్ కాలనీ 3వ అడ్డరోడ్డులో 23.5 గదుల స్థలం కొన్నాడు. అందులో రూ.5,30,000తో మున్సిపాలిటీ నుంచి అన్ని అనుమతులు తీసుకుని ఇల్లు నిర్మించుకున్నాడు. స్థానికంగా ఉన్న బొజ్జా వీరయ్య అనే అతను కబ్జాచేసి తనను ఇంటికి వెళ్లనీయకుండా రోడ్డుకి అడ్డంగా రేకుల షెడ్డు ఏర్పాటు చేసి ఇబ్బందులు పెడుతున్నాడన్నారు. అదేవిధంగా తూర్పు వైపున ఉన్న వీడీఓ కాలనీ వైపు రేకుల షెడ్డు వారితో మాట్లాడుకుని అక్కడ రోడ్డుకి అడ్డంగా గుంత తీశారన్నారు. అదేంటని అడిగితే వీడీఓ కాలనీ ప్రెసిడెంట్ రూ.5,00,000 డిమాండ్ చేస్తున్నాడన్నారు. రెండోవైపు వాళ్లు రూ.4,00,000 డిమాండ్ చేస్తున్నారన్నారు. ఈ విషయమై అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకుండా ఉందన్నారు. వారి బారి నుంచి తనను కాపాడాలని జేసీ గోపాలకృష్ణను వేడుకున్నాడు. మీ కోసం కార్యక్రమంలో జేసీతో పాటు డీఆర్వో చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్‌రెడ్డి, కుమార్, జాన్సన్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

విద్యార్థినులతో ఉపాధ్యాయుల అసభ్య ప్రవర్తన

- త్రీమెన్ కమిటీ విచారణలో ముగ్గురు ఉపాధ్యాయులపై ఆరోపణ
- ఒకరిపై సస్పెన్షన్ వేటు, మిగిలిన ఇద్దరిపై చర్యలు శూన్యం

సింగరాయకొండ: మండలంలోని పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులపై ఉపాధ్యాయుల లైంగిక వేధింపులు అధికమయ్యాయి. ఇటీవల ఒకరిపై ఆరోపణలు రాగా, ప్రస్తుతం మరో ఇద్దరిపై ఆరోపణలు రావటంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయునిగా పనిచేసి ఊళ్లపాలెం ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లిన పిల్లి హజరత్తయ్యపై లైంగిక వేధింపుల ఆరోపణలు రావటంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా త్రిసభ్య కమిటీ వేసి విచారణకు ఆదేశించారు. కమిటీలో సభ్యులైన డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వరరావు, జీసీడీఓ కే హేమలత, ఎంఈఓ-1 కత్తి శ్రీనివాసరావు గత నెల 29వ తేదీ విచారణ చేపట్టారు. విద్యార్థినులను ప్రత్యేకంగా విచారించగా హజరత్తయ్యపై వచ్చిన ఆరోపణలు నిర్ధారణ కావడంతో కలెక్టర్ ఆదేశాలతో హజరత్తయ్యను సస్పెండ్ చేశారు. సోమవారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

మరో ఇద్దరు ఉపాధ్యాయులపై ఆరోపణలు...


పాకల ఉన్నత పాఠశాలలో త్రిసభ్య కమిటీ విచారణలో మరో ఇద్దరు ఉపాధ్యాయులు కూడా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని విద్యార్థినులు ఆరోపించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఆరోపణల విషయాన్ని డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వరరావు నిర్ధారించారు. పాఠశాలలోని తెలుగు, ఇంగ్లిషు ఉపాధ్యాయులపై ఆరోపణలు వచ్చాయన్నారు. అయితే సదరు ఉపాధ్యాయులు మాత్రం విద్యార్థినులు తప్పు చేసినప్పుడు దండించామని, అది మనసులో పెట్టుకుని కమిటీ వద్ద తమపై తప్పుడు ఆరోపణలు చేశారని చెప్పడం గమనార్హం. త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదికపై హజరత్తయ్యను సస్పెండ్ చేయగా, మిగిలిన ఇద్దరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోకపోవటం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

కిరాణా దుకాణంలో చోరీ

ఒంగోలు టౌన్: నగరంలో దొంగలు తెగబడ్డారు. నగరం నడిబొడ్డున నిత్యం ప్రజలు సంచరించే పాత కూరగాయల మార్కెట్ వద్ద ఒక కిరాణా దుకాణం షట్టర్ పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం... నగరానికి చెందిన బి.రంగనాథం పాత కూరగాయల మార్కెట్ వద్ద వెంకటకృష్ణ జనరల్ స్టోర్స్ నిర్వహిస్తున్నారు. ఆదివారం దుకాణం తెరిచిన ఆయన.. రాత్రి 9 గంటల ప్రాంతంలో తాళం వేసి ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు సోమవారం ఉదయం దుకాణం తెరిచేందుకు వచ్చిన ఆయనకు షట్టర్ తాళాలు పగులగొట్టి ఉండటం కనిపించింది. షట్టర్ తెరిచి చూడగా, దుకాణం లోపల క్యాష్ కౌంటర్లోని నగదుతో పాటు సుమారు 2 లక్షల రూపాయల విలువైన సిగరెట్లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే స్థానిక వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ నాగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపై రాకపోకల అడ్డగింత

- కోర్టు ఆదేశాలు సైతం ఉల్లంఘించి బెదిరింపులు
- పోలీస్ స్పందన కార్యక్రమంలో ఎస్పీకి బాధితుడి ఫిర్యాదు


పోలీస్ శాఖ స్పందన కార్యక్రమంలో ఎస్పీకి ఫిర్యాదు చేసిన రసీదు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడులోని ఎంపీడీఓ కార్యాలయం వెనుకవైపు రోడ్డుపై కొందరు వ్యక్తులు రాకపోకలను అడ్డుకుని స్థానికులను ఇబ్బందులు గురిచేస్తుండటంతో సోమవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్‌శాఖ స్పందన కార్యక్రమంలో ఎస్పీ దామోదర్‌కు బాధితుడు ఇనగంటి సుబ్రహ్మణ్యం అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఫిర్యాదు చేశారు. బొద్దులూరి యల్లమంద అనే వ్యక్తి హైకోర్ట్ ఆర్డర్ కూడా లెక్కచేయకుండా ఆ రోడ్డులో ఉంటున్న వారు రాకపోకలు సాగించకుండా అడ్డంగా వాహనాలు నిలిపి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాడని ఆరోపించారు. దీనిపై గతంలో జరిగిన తగాదా నేపథ్యంలో జిల్లా కోర్టులో కేసు వేయగా, కోర్టు టెంపరరీ ఇంజక్షన్ ఆర్డర్ కూడా ఇచ్చి రాకపోకలకు అడ్డంకులు కలిగించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఇటీవల హైకోర్ట్‌లో విచారణ జరగ్గా, రహదారికి అడ్డంపెట్టిన వాహనాలు తొలగించాలని సంతనూతలపాడు పోలీసులను కోర్టు ఆదేశించిందని తెలిపారు. పోలీసులు కూడా యల్లమంద కుటుంబానికి రోడ్డుపై పార్కింగ్ చేయరాదని చెప్పి వాహనాలు తొలగించారన్నారు. కానీ, పోలీసుల మాట కూడా హైకోర్ట్ ఆదేశాలను కూడా ఉల్లంఘించి మరుసటి రోజే మళ్లీ రోడ్డుకి అడ్డంగా యల్లమంద బైకులు పెట్టిస్తున్నాడని సుబ్రహ్మణ్యం ఎస్పీకి వివరించారు.

తప్పుడు కేసులు పెట్టి బెదిరింపులు...

ఇటీవల రాఖీ పండుగ రోజు తన అక్క రాఖీ కట్టడానికి సన్నిహితులు, స్నేహితులతో తమ ఇంటికి రాగా, యల్లమంద ఉద్దేశపూర్వకంగా వారిని బూతులు తిట్టాడని సుబ్రహ్మణ్యం ఎస్పీ ఎదుట వాపోయాడు. పైగా, పోలీస్ స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదులు చేసి బెదిరిస్తున్నాడన్నారు. తమ వీధి వైపుగానీ, తమ ఇంటివైపుగానీ ఎవరైనా వస్తే చంపేస్తామంటూ హెచ్చరిస్తున్నాడని తెలిపారు. పోలీసుల విచారణలో తాము చూపించిన ఫొటోలు, వీడియోలు ఉన్నా కూడా తమ స్నేహితులపైనే బైండోవర్ రాశారని సుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాలున్నా కూడా పోలీసు రక్షణ లేకుండా తమను ఒంటరివాళ్లను చేసి తప్పుడు కేసులు పెడతామని భయపెడుతున్నారన్నారు. ఇది ఇలాగే కొనసాగకుండా తక్షణం చర్యలు తీసుకుని తమకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీకి సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు.


వివాదానికి కారణమైన రోడ్డు

పోలీసు స్పందనకు 64 ఫిర్యాదులు


బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం మీ కోసంలో 64 ఫిర్యాదులు వచ్చాయి. వివిధ సమస్యలతో జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన బాధితులు నేరుగా ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ప్రజా సమస్యలపై స్పందించిన ఎస్పీ.. నేరుగా ఆయా పోలీసుస్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. మీ కోసంలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి ఒక్క బాధితుడికి న్యాయం జరగాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖ ప్రజలకు అండగా నిలబడాలన్న ఉద్దేశంతోనే ప్రతి వారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణ కుమార్, ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐ దుర్గాప్రసాద్, సీసీఎస్ సీఐ జగదీష్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ఎస్సై జనార్దన్‌రావు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి..

పుల్లలచెరువు: మాకు న్యాయం చేయండి అంటూ వినుకొండకు చెందిన గజ్వల్లి విజయభారతి, కుమారుడు మణికంఠ గుప్త సోమవారం ఒంగోలులోని పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. తన భర్త గజ్వల్లి నాగేశ్వరరావుకు సోదరులైన పుల్లలచెరువుకు చెందిన గజ్వల్లి భాస్కరరావు, గజ్వలి శ్రీనివాసరావు తన భర్తకు రావాల్సిన ఆస్తులు అడగడానికి తేదీ 30-07-2025న పుల్లలచెరువు వెళ్లిన తమను తీవ్రంగా అవమానించి ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి షాపు వద్ద మాట్లాడుతున్న తమపై భాస్కరరావు, శ్రీనివాసరావు పుల్లలచెరువు పోలీసులకు ఫిర్యాదు చేసి తమ కుమారుడిని స్టేషన్‌కు తీసుకెళ్లారన్నారు. స్టేషన్‌లో పోలీసులతో కొట్టించి దుర్భాషలాడారన్నారు. అదే రోజు స్టేషన్‌లో పోలీసుల సమక్షంలో ఈ నెల 15వ తేదీ నాటికి తమను పిలిచి పరిష్కరిస్తానని వారిద్దరూ చెప్పి ఉన్నారన్నారు. కానీ, నేటికీ ఎటువంటి సమాచారం లేదన్నారు. తనకు, తన కుమారుడికి తన మరుదులు, పోలీసులతో ప్రాణహాని ఉందని, తమకు న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదు చేశారు.